



నిన్నటి పెద్దపల్లి సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు హాజరైన జన సందోహం

# సభలు సక్సెస్.. సకలజనం జోష్

## భరోసానింపిన ప్రజా ఆశీర్వాద సభలు

కరీంనగర్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) పెద్దపల్లి (నమస్తే తెలంగాణ) : ఎన్నికల వేళ బీఆర్ఎస్ బలం.. బలగం పెరుగుతున్నది. పార్టీ అభ్యర్థులకు ఊరూరా సంపూర్ణ మద్దతు లభిస్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రామగుండం, పెద్దపల్లి దశాబ్ది ప్రగతి సభలు ఉత్సాహం నింపగా, తాజాగా అధినేత కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో జోష్ నింపారు. మంగళవారం మంథని, పెద్దపల్లిలో సభలకు హాజరైన ఆయన, రెండు చోట్లా అశేష జనాన్ని ఉద్దేశించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఒక్కో చోట దాదాపు 30 నిమిషాలపాటు మాట్లాడిన ఆయన, తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూనే.. ప్రతిపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. మంథని, పెద్దపల్లి అభ్యర్థులు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డిపై ప్రశంసజల్లు కురిపిస్తూనే అభివృద్ధిపై హామీ ఇచ్చారు. మంథనిలో పుట్ట మధును గెలిపిస్తే వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తానని, పెద్దపల్లిలో దాసరి మనోహర్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లోనే అడిగినవన్నీ చేస్తానని ప్రకటించారు. సీఎం ప్రసంగాన్ని ఆద్యంతం సభికులంతా ఆసక్తిగా విన్నారు. మధ్యమధ్యలో ఆయన వేసిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. కరతాళ ధ్వనులతో మద్దతు తెలిపారు.

### ఆలోచింపజేసిన ప్రసంగం

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో స్థానిక అంశాలను ప్రస్తావిస్తూనే.. ఆద్యంతం తన ప్రసంగంతో ఆలోచింపజేశారు. ఓవైపు ఓటు హక్కు విలువను తెలియజేస్తూనే.. మరోవైపు ఆగమై ఓటు వస్తే జరిగే పరిణామాలను కండ్లకు కట్టినట్టు వివరించగా, సభికులంతా ఆసక్తిగా విన్నారు. ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయిస్తదని, తలరాతను మారుస్తదని, ఓటు వేసే ముందు అభ్యర్థి గుణగణాలనే కాదు, పార్టీ చరిత్రను చూడాలని, విచక్షణతో ఆలోచించి వేయాలని సూచించడంతో ప్రతి ఒక్కరూ స్వాగతించారు. యాభై ఎనిమిదేళ్ల సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయం, కరెంట్, సాగు, తాగునీటి కోసం పడ్డ కష్టాలు.. రాష్ట్రం ఏర్పాటు తర్వాత తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమ ఫలాల గురించి అర్థమయ్యేలా వివరించగా, ప్రజలంతా ఆలోచనలో పడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుబంధు దుబారా అంటున్నరు? 24 కరెంట్ వద్దంటున్నరు? ధరణి తీసి బంగాళాఖాతంలో వేస్తమంటున్నరు? వాటిని కొనసాగిద్దామా.. వద్దా..? అని ప్రశ్నించగా.. సభికులంతా చేతులెత్తి కొనసాగించాలంటూ పెద్దపెట్టున నినదించారు. మరోవైపు బీఆర్ఎస్ రావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూనే.. మంథని, పెద్దపల్లి అభ్యర్థులు పుట్ట మధూకర్, దాసరి మనోహర్ రెడ్డిపై ప్రశంసలవర్షం కురిపించారు. మంథనిలో బీసీ బిడ్డ పుట్టమధుకు అవకాశం వచ్చిందని, బీసీలంతా ఏకమై గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేయగా, ప్రజలంతా చప్పట్లతో మద్దతు తెలిపారు. అలాగే పెద్దపల్లిలో మనోహర్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరగా, అందరూ కరతాళ ధ్వనులతో జైకొట్టారు.

### శ్రేణుల్లో ఫుల్ జోష్

మంథని, పెద్దపల్లిలో ప్రజా ఆశీర్వాదసభలకు బ్రహ్మరథం పట్టారు. రెండు నియోజకవర్గాల నుంచి వేలాది మంది తరలివచ్చి జైకొట్టారు. నిజానికి అధినేత కేసీఆర్ ప్రసంగంతో ఆకట్టుకోవడం, అభివృద్ధి హామీ ఇవ్వడంతో సకల జనుల నుంచి ఊహించని స్పందన వస్తున్నది. ఇప్పటికే నియోజకవర్గాలు అభివృద్ధిలో దూసుకెళ్తుండగా, కేసీఆర్ మంథనికి వెయ్యి కోట్లు ఇస్తామని, పెద్దపల్లి ఎమ్మెల్యే అడిగనవన్నీ ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లోనే చేస్తామని చెప్పడం ప్రజలంతా స్వాగతిస్తున్నారు. నియోజవర్గంలో ఎవరినీ కదిలించినా ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఇచ్చిన మాట తప్పరని, ఇప్పటికే అన్ని వర్గాలకు అడుగకుండానే ఎంతో చేశారని చెబుతున్నారు. ఆయన వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుంటామని, కేసీఆర్‌ను మరోసారి హ్యాట్రిక్ చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. సభలు జరిగిన తీరు, ప్రజల స్పందనను చూసి బీఆర్ఎస్ గెలుపు ఖాయమని సీనియర్ రాజకీయ నాయకులు, విశ్లేషకులు కూడా అంచనా వేస్తుండగా, గులాబీ శ్రేణులు ఆనంద పడుతున్నాయి. మంగళవారం రెండు చోట్లా విజయోవత్సవ సభలను తలపించడం, ప్రజల నుంచి విశేష స్పందన రావడం, ఇప్పటికే అన్ని పార్టీల నుంచి చేరికలు పెరగడం చూసి నయా జోష్‌లో మునిగితేలుతున్నాయి. గులాబీ జెండా తప్పకుండా ఎగురుతుందనే ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రజలకు మంచి చేయకున్నా చెడు కోరవద్దు

- ఐదేండ్లు ఎంపీగా ఉండి చేసిన అభివృద్ధి ఏమిటి?
- బండి సంజయ్‌పై నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ధ్వజం



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 8: కరీంనగర్ ప్రజలకు నాయకుడిగా మంచి చేయకున్నా.. దుర్మార్గపు ఆలోచనతో కీడు కోరవద్దని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కి సూచించారు. అభివృద్ధి, సంక్షేమం ఆగిపోవాలే.. ప్రాజెక్టులు కూలిపోవాలనే కోరుకోవడం తప్ప ప్రజలకు మంచి చేయాలన్న బుద్ధి ఆయనకు లేదని దుయ్యబట్టారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. కేబుల్ బ్రిడ్జి కూలిపోతుందని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కరీంనగర్‌లో చేసిన అభివృద్ధి ప్రజలకు కండ్లకు కట్టినట్లు కనిపిస్తున్నదన్నారు. ఎంపీగా గెలిచిన సంజయ్ ఏనాడూ నగరంలో తిరగలేదని, అందుకే ఆయన కండ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనబడడం లేదని విమర్శించారు. ఇప్పుడు శాసనసభ ఎన్నికల్లో ఓట్ల కోసం నగర వాడల్లో పర్యటిస్తున్నారని.. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఇప్పుడు కనిపిస్తుందన్నారు. నగర ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్న తీరును చూసి బిత్తర పోయిన బండి సంజయ్, కేబుల్ బ్రిడ్జి కూలిపోతుందని అపశకునపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎంత సేపు ప్రాజెక్టులు కూలిపోవాలే, వంతెనలు పడి పోవాలనే ఆలోచనలే తప్ప ప్రజలకు మంచి జరుగాలని కోరుకోవాలనే ఆలోచన సంజయ్‌కి ఏనాడూ లేదని ధ్వజమెత్తారు. ఇలాంటి మాటలబట్టే సంజయ్ అంతరంగం, ఆలోచన ఏమిటో అర్థమవుతున్నదని, తెలంగాణ రాష్ట్రంపై కీడు కోరుకునే సంజయ్‌కి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఐదు సంవత్సరాలు ఎంపీగా ఉండి ఏం అభివృద్ధి చేసి వెలగబెట్టావో ప్రజలందరికీ తెలుసని నిప్పులు చెరిగారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన పార్టీ కేవలం బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మంత్రి గంగుల కమలాకర్ నామినేషన్‌కు ప్రజలు భారీగా తరలిరావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికలు వస్తేనే సంజయ్‌కి కరీంనగర్ ప్రజలతో అవసరమని దుయ్యబట్టారు. తమకు నిరంతరం ప్రజల శ్రేయస్సు, ప్రజల క్షేమమే ముఖ్యమన్నారు. ఇప్పటికైనా బండి సంజయ్ ఇలాంటి అపశకునపు మాటలు మానుకోవాలని హితవు పలికారు.

# ఉద్యమకారులు సంఘ విద్రోహులా?



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

- చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చాకే బైండోవర్‌కు పిలువాలి
- లేకపోతే కోర్టును ఆశ్రయిస్తాం
- రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, నవంబర్ 8: కరీంనగర్ జిల్లాలో తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు ఇవ్వకుండా బైండోవర్ చేయిస్తే తాము కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ సీపీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉద్యమకారుల ఇండ్లకు పోలీసులను పంపించి భయభ్రాంత్రులకు గురి చేస్తున్నారని విమర్శించారు. చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చిన తర్వాతే బైండోవర్‌కు పిలువాలన్నారు. ఎన్నికలు జరుపుతున్నారా? లేక ఉద్యమకారులను బైండోవర్ చేయడమే లక్ష్యమా? అని ప్రశ్నించారు. ఎవరి కొమ్ముకాసేందుకు ఈ బైండోవర్లు చేస్తున్నారో సీపీ చెప్పాలన్నారు. ఎలాంటి కేసులు లేకున్నా ఎందుకు బైండోవర్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో జిల్లా ఎన్నికల అధికారి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యమకారులందరూ కూడా ఏకం కావాల్సి వస్తుందన్నారు. ఉద్యమకారులు ఏమైనా సంఘవిద్రోహులా? అని ప్రశ్నించారు. పోలీసులు ఇలాగే వ్యవహరిస్తే కోర్టును ఆశ్రయించడంతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో కూడా ఇలాంటి చర్యలు లేవని, కేవలం కరీంనగర్ జిల్లాలోనే ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య, గుంజపడుగు హరిప్రసాద్, మైకెల్ శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

# ఆశీర్వాదం తీసుకొని.. నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రం నింపుతున్న మంత్రి

కరీంనగర్‌లో భారీ జన సందోహం మధ్య బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు మంత్రి తన కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్ గులాబీమయమైంది.

**-కార్పొరేషన్, నవంబర్ 8**



గంగులకు విజయ తిలకం దిద్దుతున్న కూతురు



గంగుల కమలాకర్ నామినేషన్‌కు మహిళలతో కలిసి తరలివెళ్తున్న డిప్యూటీ మేయర్ స్వరూపారాణి

# ట్రాక్టర్‌ను ఢీకొని బాలుడి మృతి

తిమ్మాపూర్, నవంబర్ 8: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో బాలుడు మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఆయున్ ఖాన్(14) బుధవారం మధ్యాహ్నం సమయంలో తీగల వంతెనపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనంతో అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఢీకొనగా, అతడి ఛాతికి, తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా ఆయున్ ఖాన్ మృతిచెందాడు. బాలుడి తండ్రి ఆయుబ్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు.